పారిశుద్ధ్యం..అస్తవ్యస్తం

- శాలిబండలోని పలు ప్రాంతాల్లో పేరుకుపోతున్న చెత్తాచెదారం
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు




ఖాజీపురా సల్మాన్ జిమ్ ఎదుట బోర్‌వెల్ తాగునీటి నల్లా వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం

శాలిబండ: శాలిబండ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. డివిజన్‌లోని ఖాజీపురా సల్మాన్ జిమ్ ప్రాంతంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. తాగునీటి నల్లా పక్కనే చెత్తాచెదారం కుప్పలుగా పేరుకుపోవడంతో స్థానిక ప్రాంతంలో అపరిశుభ్రంగా తయారయ్యింది. చెత్తకుప్పలను పారిశుద్ధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో చెత్తాచెదారం పేరుకుపోతుందని స్థానికులు వాపోతున్నారు. దీంతో తాము అనారోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సిన పరిస్థితి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అంతేకాకుండా డివిజన్‌లోని బోర్‌వెల్ నీటిలో డ్రైనేజీ నీరు సరఫరా అవుతుందని.. అవసరాలకు వినియోగించుకునేందుకు బోర్‌వెల్ నీరు ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. తాగునీటి నల్లా వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించడానికి పారిశుద్ధ్య సిబ్బందిని చెప్పినా.. పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. చేతిపంపు వద్ద మురుగునీటితో తీవ్ర దుర్గంధం వెదజల్లుతుందని వాపోతున్నారు. దీనిపై సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా...

14న అమృతలత-అపురూప అవార్డుల ప్రదానోత్సవ సభ

నాంపల్లి: వివిధ రంగాల్లో విశేషమైన సేవలందిస్తున్న నిష్ణాతులైన పలువురు లబ్ధ ప్రతిష్ఠులకు ప్రతి ఏటా అమృతలత-అపురూప అవార్డులు అందజేస్తూ వస్తున్నారు. ఈ ఏడాది కూడా అమృతలత-అపురూప అవార్డులు-2023 అందజేయడానికి ఎంపికైన పురస్కార గ్రహీతలను బుధవారం ప్రకటించారు. అమృతలత జీవన సాఫల్య పురస్కారాలు పొందుటకు నవలా రచన విభాగంలో గుంటి భానుమతి, విద్యారంగంలో డాక్టర్ విజయలక్ష్మి పండిట్ ఎంపికయ్యారు. అపురూప పురస్కారాలకు మహెజబీన్ (మహిళాభ్యుదయం), కె.ఎస్.మల్లీశ్వరి (కథా రచన), మందరపు హైమవతి (కవిత్వం), శైలజా మిత్ర (సాహితీ విమర్శ), మాణికేశ్వరి (సినీ జర్నలిజం), ప్రేమ మాలిని (జర్నలిజం-ఎలక్ట్రానిక్ మీడియా), ద్వారం లక్ష్మి (శాస్త్రీయ సంగీతం), కె.రత్నశ్రీ (శాస్త్రీయ నృత్యం), ఆలపాటి లక్ష్మి (రంగస్థలం), జ్యోతి వలబోజు (పుస్తక ప్రచురణ) విభాగాలలో ఎంపికైన వీరికి పురస్కారాలను అందజేస్తారు. ఈనెల 14న ఆదివారం సాయంత్రం 4.30 గంటలకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో అవార్డుల ప్రదానోత్సవం సభ జరుగుతుందని అవార్డుల కమిటీ కన్వీనర్ నెల్లుట్ల రమాదేవి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీనియర్ జర్నలిస్టు కె.శ్రీనివాస్, సినీ నేపథ్యగాయని బి.వసంత హాజరవుతున్నట్లు వివరించారు.

సన్మానం



యాకుత్‌పురా: ఇటీవల ఎన్నికైన హైదరాబాద్ జిల్లా సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులను బుధవారం పురానీహవేలిలోని అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాదులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు వినోద్‌కుమార్, కార్యదర్శి రఘువీరారెడ్డి, జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కౌన్సిల్ మాణిక్ ప్రభుగౌడ్, స్పెషల్ జీపీ ఎం.ఎస్.తిరుమ్ రావు, ఏజీపీలు శ్రీహరి, చక్రాధర్, ఇందిరాదేవి, న్యాయవాదులు తెలిపారు.

కవులు నిరంతర అధ్యయనం చేయాలి



కవులతో ఆయాచితం శ్రీధర్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: భారతదేశంలోనే చైతన్యవంతమైన కవులను కలిగిఉన్న రాష్ట్రం తెలంగాణ అని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ అన్నారు. బుధవారం రవీంద్రభారతిలో తెలంగాణ ప్రజా గ్రంథాలయాల అభివృద్ధి సంఘం, తెలంగాణ రచయితల సంఘం జంటనగరాల శాఖ ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ దార్శనికతతో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేశారని, ఈ విగ్రహ ఏర్పాటుపై కవితులు రాయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ ఆయాచితం శ్రీధర్ మాట్లాడుతూ.. కవులు నిరంతర అధ్యయనం చేయాలని సూచించారు. అనంతరం పలువురు కవులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలుగు విశ్వ విద్యాలయం ఉప సంచాలకులు ఐనంపూడి శ్రీలక్ష్మీ, బతుకమ్మ పాటల పరిశోధకురాలు బండ్లారు సుజాత, నగర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రసన్న రామ్మూర్తి, గ్రంథాలయ అభివృద్ధి సంఘం వ్యవస్థాపకులు కె.దేవేందర్ పాల్గొన్నారు.

తెలంగాణ బజరంగ్ సేనను మరింత బలోపేతం చేస్తాం

సుల్తాన్‌బజార్: తెలంగాణ బజరంగ్ సేనను మరింత బలోపేతం చేస్తామని బజరంగ్ సేనా జాతీయ అధ్యక్షుడు రణ్‌వీర్ ఫతేరియా, జాతీయ ప్రధాన కార్యదర్శి అశోక్‌శర్మ, రాష్ట్ర అధ్యక్షుడు శివప్రసాద్, ఉపాధ్యక్షులు ఎస్.ఆర్. లక్ష్మణ్‌రావు పేర్కొన్నారు. ఈ మేరకు నగరంలో బజరంగ్ సేనా కార్యాలయాన్ని అధికారికంగా ప్రారంభించారు.

అలీ బాక్రీ ముందస్తు అరెస్ట్

చార్మినార్: సీఎం కేసీఆర్ ఇఫ్తార్ విందును వాయిదా వేయాలని డిమాండ్ చేసిన బీజేపీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ బుధవారం డబీర్‌పురా పోలీసులు ముందస్తు చర్యల్లో భాగంగా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు.



భాషా ప్రావీణ్యంతో ఉన్నత అవకాశాలు



మాట్లాడుతున్న ఆచార్య మురళీకృష్ణ

చార్మినార్: ఇంగ్లిష్ భాషలో ప్రావీణ్యాన్ని పొందటానికి ఉన్న అనేక మార్గాలపై అధ్యాపకులు అధ్యయనం చేసి ఆయా మార్గాల్లో విద్యార్థులు తర్ఫీదు పొందేలా కృషి చేయడం ద్వారా వారు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌లో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకుంటారని ఉస్మానియా విశ్వవిద్యాలయం డీన్ ఆచార్య మురళీకృష్ణ అన్నారు. ప్రభుత్వ సిటీ కళాశాల ఆంగ్ల విభాగం 'ఆంగ్ల భాషా ప్రావీణ్యం-పాఠ్య పుస్తకాలు, సందర్భాలు, ప్లాట్‌ఫారమ్‌లు అనే అంశంపై రెండు రోజుల జాతీయ సెమినార్‌ను నిర్వహించింది. ఈ సదస్సు ప్రారంభ సభలో ముఖ్యఅతిథిగా ఆచార్య మురళీ కృష్ణ పాల్గొనగా.. ముగింపులో సభలో ఆచార్య వెంకట్ రాజాం పాల్గొన్నారు. ప్రారంభ సభకు ప్రొఫెసర్ పి.బాలభాస్కర్ అధ్యక్షతన వహించారు. ప్రధాన వక్త డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ.. తరగతి గది వెలుపల సాంకేతికత సహాయంతో విద్యార్థులకు ఇంగ్లిష్‌లో ప్రావీణ్యం సంపాదించడానికి అధ్యాపకులు తోడ్పడాలని సూచించారు. ఆంగ్ల విభాగ ధిపతి డాక్టర్ ఆది రమేశ్ సమన్వయకర్తగా వ్యవహరించిన ఈ సదస్సులో రాష్ట్రంలోని వివిధ కళాశాలల నుంచి సుమారు 50 మందికి పైగా అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు పాల్గొని పత్ర సమర్పణ చేశారు. ఈ సదస్సులో డాక్టర్ కృష్ణ చంద్రకీర్తి, డాక్టర్ మల్లికార్జున్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయం



కార్వాన్ కాంగ్రెస్ కన్వీనర్‌తో కృష్ణ తదితరులు

గోల్కొండ: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ మెజార్టీ స్థానాలు గెలవడం ఖాయమని ఆ పార్టీ కార్వాన్ నియోజకవర్గం కన్వీనర్ జి. సరిత అన్నారు. బుధవారం ఆమె కార్వాన్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె కార్వాన్‌లో కాంగ్రెస్ ఓటు బ్యాంకు విషయంపై కాంగ్రెస్ నాయకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పేద బడుగు వర్గాలతో పాటు దళితులు, మైనార్టీలు ఎప్పుడూ కాంగ్రెస్ పక్షానే ఉన్నారన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నాయన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా అవినీతిలో పేరుకుపోయిందని ఆమె ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కురకుల కృష్ణ, చంటిబాబు, హామిద్ ఖాన్, చంద్రోఖర్, వినోద్‌సింగ్, గిరి తదితరులున్నారు.

నూతన ఆవిష్కరణల దిశగా యువత అడుగులు వేయాలి



మాట్లాడుతున్న తెలంగాణ చీఫ్ ఇన్నోవేషన్ అధికారి డాక్టర్ శాంత

చార్మినార్: నూతన ఆవిష్కరణల దిశగా యువత అడుగులు వేయాలని తెలంగాణ చీఫ్ ఇన్నోవేషన్ అధికారి డాక్టర్ శాంత అన్నారు. ప్రభుత్వ సిటీ కళాశాల కామర్ మేనేజ్‌మెంట్ విభాగం నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభ సభలో డాక్టర్ శాంత ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వినూత్న ఆలోచనలతో ముందుగా వచ్చే మహిళల కోసం వీ-హబ్ నెలకొల్పిన రాష్ట్ర ప్రభుత్వం.. ప్రస్తుతం యువత కోసం ప్రత్యేకంగా వై-హబ్ ప్రారంభించే ఆలోచనలో ఉందన్నారు. కేవలం ఇంజినీరింగ్, టెక్నాలజీ కోర్సులు చదివిన నగరాల్లోని విద్యార్థులను కాక గ్రామీణ ప్రాంతాల్లో యువత నిజజీవిత సమస్యలకు సూచించే పరిష్కారాలకు ఎక్కువ గుర్తింపు ఉంటుందన్నారు. అలాంటి వారిని వివిధ కార్యక్రమాల ద్వారా గుర్తించి వారికి కావాల్సిన ఆర్థిక, సాంకేతిక సహకారం అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం కామర్స్ శాఖాధ్యక్షులు ఆచార్య చెన్నప్ప, సభాధ్యక్షులు, కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్, కళాశాల విద్యాశాఖ ఏజీఓ డాక్టర్ డి.టి.చారి, డాక్టర్ ఝాన్సీరాణి, డాక్టర్ జయా కాగడా, వాణిజ్య శాస్త్ర విభాగం అధ్యక్షులు డాక్టర్ జె.రత్న ప్రభాకర్, డాక్టర్ మల్లికార్జున్, డాక్టర్ శ్రీధర్, గజేంద్రబాబు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురి రిమాండ్

గౌలిపురా: గంజాయిని విక్రయించేందుకు ప్రయతిస్తున్న ముగ్గురిని భవానీనగర్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఎస్సై సైదమ్మ తెలిపిన వివరాల ప్రకారం.. భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మోయిన్‌బాగ్‌కు చెందిన రౌడీషీటర్ సయ్యద్ ఇమ్రాన్ (25), నషేమాన్‌నగర్ మహ్మద్ జాఫర్ (30), షాహీన్‌నగర్‌కు చెందిన సయ్యద్ ఖదీర్ (40) కలిసి గంజాయిని విక్రయిస్తుంటారు. ఈనెల 11న మోయిన్‌బాగ్ యూనిక్ స్కూల్ ప్రాంతంలో వీరు ముగ్గురు కలిసి గంజాయి విక్రయిస్తున్నారనే విశ్వసనీయమైన సమాచారం మేరకు భవానీనగర్ ఎస్సై సైదమ్మ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సయ్యద్ ఇమ్రాన్, మహ్మద్ జాఫర్, సయ్యద్ ఖదీర్‌ను అరెస్టు చేసి వద్ద నుంచి 1.45 గ్రాముల గంజాయి, 60 ప్లాస్టిక్ కవర్లు, మూడు ఫోన్లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుల్లో వీరి ముగ్గురికి గంజాయిని విక్రయించిన ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ దాడుల్లో డీఐ శేఖర్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం

విజయనగర్‌కాలనీ: మహిళా అదృశ్యమైన ఘటన ఆసీఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఆలస్యంగా వెలుగు చూసింది. అడ్మిన్ ఎస్సై మహ్మద్ జాహేద్ తెలిపిన వివరాల ప్రకారం.. అస్సాం బర్పేట, పటాచార్‌కుడి బార్మలికుచి ప్రాంతానికి చెందిన కె. కరిష్మాఖాతూమ్(30) వివాహిత. ఈమే గత నెలలో మెహిదీపట్నం అయోధ్యనగర్ కే.గీతారెడ్డి గర్ల్స్ హాస్టల్‌లో ఆమె చెలెల్లు బనితా దగ్గరకు వచ్చి ఉంటుంది. గత నెల 19న సాయంత్రం 6 గంటలకు ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తెలిసిన వారు, బంధుమిత్రుల వద్ద వాకాబు చేసినా ప్రయోజనం లేకపోవడంతో ఆమె భర్త అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



కరిష్మా ఖాతూమ్

ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్ పరిధిలో..

చాంద్రాయణగుట్ట: యువకుడు అదృశ్యమైన ఘటన ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్సై శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫలక్‌నుమా గుల్జార్ నగర్‌కు చెందిన షేక్ ఇక్బాల్ మూడో కుమారుడు షేక్ అబ్దుల్ రహమాన్(19) ఏసీ టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 11న ఉదయం 5 గంటలకు కుటుంబసభ్యులందరూ నిద్రిస్తుండగా ఇక్బాల్ నమాజ్‌కు వెళ్లాడు. 10 గంటల సమయంలో చూడగా అతని కుమారుడు రహమాన్ కనిపించలేదు. అతని ఫోన్ సైతం స్విచ్ఛాఫ్ ఉండడంతో స్థానికంగా గాలించినా ఫలితం లేకుండా పోయింది. ఈ విషయమై అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ఫలక్‌నుమా పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



అబ్దుల్ రహమాన్ (ఫైల్)

ప్రజా సమస్యలను పరిష్కరించాలి



గోషామహల్‌లో పర్యటించిన బీఆర్‌ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్‌యాదవ్

అబిడ్స్: ప్రజా సమస్యలను అన్నిశాఖల అధికారులు వేగవంతంగా పరిష్కరించాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఆశీష్ కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. జీహెచ్‌ఎంసీ, వాటర్‌బోర్డు, విద్యుత్, ఇతర శాఖల అధికారులు సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. గోషామహల్ పరిధిలో షాహినాయత్‌గంజ్ నూతన పోలీస్‌స్టేషన్ నిర్మాణం అవుతున్న ప్రాంతంలో రహదారి లేకపోవడంతో ఆయన పర్యటించి స్థానికులకు నచ్చజెప్పారు. వెంటనే పోలీస్‌స్టేషన్‌కు రహదారి ఇచ్చేందుకు స్థానికులు అంగీకరించారు. ఈ సందర్భంగా ఆశీష్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి ముందుంటానన్నారు.

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్



గోషామహల్‌లో పర్యటించిన బీఆర్‌ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్‌యాదవ్

అబిడ్స్: మతసామరస్యానికి ప్రతీకగా ఇఫ్తార్‌విందులు దోహదపడుతాయని నాంపల్లి నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఉపాధ్యక్షుడు మెట్టు వెంకటేష్ పేర్కొన్నారు. ప్రజల్లో స్నేహభావాలు పెంపొందించేందుకు ఇఫ్తార్ విందు ఒక వేదికలాంటిదన్నారు. ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో నాంపల్లి నియోజకవర్గం నుంచి కార్యకర్తలు, అనుచరులతో కలిసి మెట్టు వెంకటేష్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రభుత్వం అన్నివర్గాల ప్రజల పండుగలను స్వయంగా చేపడుతుందన్నారు. పార్టీ ఆదరణను చూసి ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయన్నారు.

గాడ్సే ఫొటో ప్రదర్శించిన యువకుడి అరెస్టు

అబిడ్స్: శ్రీరామ నవమి శోభాయాత్ర సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో జాతిపిత మహాత్మా గాంధీని హతమార్చిన గాడ్సే ఫొటోను ప్రదర్శించిన యువకుడిని షాహినాయత్‌గంజ్ పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ అజయ్‌కుమార్ కథనం ప్రకారం.. గచ్చిబౌలి సిద్దిక్‌నగర్‌కు చెందిన చింత హేమకుమార్ (21) మార్చి 30న గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ నిర్వహించిన శ్రీరామనవమి శోభాయాత్రలో పాల్గొని చుడిబజార్ ప్రాంతంలో గాడ్సే ఫొటోను ప్రదర్శించాడు. దీంతో పోలీసులు అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును షాహినాయత్‌గంజ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

భర్తను హత్య చేసిన భార్యకు జీవిత ఖైదు

చాంద్రాయణగుట్ట: భర్తను హత్య చేసిన భార్యకు నాంపల్లి న్యాయస్థానం జీవిత ఖైదు విధించింది. ఇన్‌స్పెక్టర్ కె.ఎస్.ప్రసాద్ వర్మ తెలిపిన వివరాల ప్రకారం.. చాంద్రాయణగుట్ట ప్రాంతంలో భిక్షాటన చేసే రేష్మా బేగం(25), సొహేల్ భార్యాభర్తలు. తాగుడుకు బానిసైన వీరు తరచూ గొడవపడేవారు. ఈ క్రమంలోనే 2021 మార్చి 1న చాంద్రాయణగుట్ట ప్రభుత్వ పాఠశాల పక్కన భర్తను చంపేసింది. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు నాంపల్లి కోర్టులో ఛార్జిషీట్‌ను దాఖలు చేశారు. కేసు విచారణ జరిపిన నాంపల్లి న్యాయస్థానం ఇన్‌చార్జి జడ్జి జస్టిస్ జైకుమార్ నిందితురాలికి జీవిత ఖైదు విధిస్తూ తీర్పును వెలువరిచారు.

కష్టపడి పనిచేసే వారికి పార్టీలో సముచిత స్థానం



నందకిశోర్‌వ్యాస్‌ను అభినందిస్తున్న హోంమంత్రి మహమూద్ అలీ

అబిడ్స్: కష్టపడి పనిచేసే వారికి బీఆర్‌ఎస్‌లో సముచిత స్థానం ఉంటుందని రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ పేర్కొన్నారు. పార్టీలో చురుకైన నాయకుడిగా పార్టీ పటిష్ఠతకు అహర్నిశలు కృషి చేస్తున్న నందకిశోర్‌వ్యాస్‌కు పార్టీ ఎల్లప్పుడు గుర్తిస్తుందన్నారు. గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్‌గా నియమితులైన నందకిశోర్‌వ్యాస్ బిలాల్‌ను హోంమంత్రి మహమూద్ అలీ అభినందించారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గంలో నందకిశోర్‌వ్యాస్ బిలాల్ ఆధ్వర్యంలో పార్టీ నెంబర్:1 స్థానంలో ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందరికీ అందించే విధంగా ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. నందకిశోర్ వ్యాస్ బిలాల్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పార్టీ ఇచ్చిన బాధ్యతను పూర్తిగా నెరవేరుస్తానన్నారు.

అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలి



డీఈఈ రామకృష్ణతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన బల్దియా డిప్యూటీ ఈఈ రామకృష్ణతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నానల్‌నగర్, టోలిచౌకి, గోల్కొండ తదితర డివిజన్లలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను రామకృష్ణ దృష్టికి తెచ్చారు. మజ్లిస్ ఏరియా కమిటీల ద్వారా వివిధ ప్రాంతాల సమస్యలు తన దృష్టికి వస్తాయన్నారు. అయితే ప్రజలు ఏరియా కమిటీలను బలంగా నమ్ముతారని, అందువల్లే సంబంధిత ప్రభుత్వ కార్యాలయాలకు కాకుండా మజ్లిస్ ఏరియా కమిటీల వద్దకు వెళ్తారన్నారు. అయితే అధికారులు కూడా ప్రజల నమ్మకాన్ని పొందడానికి కృషి చేయాలని సూచించారు. అధికారులు సమష్టిగా పని చేయాలన్న ఆశయంతోనే తాను తరచూ వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్ తదితరులున్నారు.

రాజకీయ ప్రాతినిధ్యంపై విద్యార్థుల్లో అవగాహన పెంచాలి



విధాన సభ ప్రాంగణంలో విద్యార్థులతో శాంతా తౌటమ్

నాంపల్లి: రాజకీయ ప్రాతినిధ్యంపై విద్యార్థుల్లో అవగాహన పెంచాలని టీఎస్ఐసీ చీఫ్ ఇన్నోవేషన్ అధికారి శాంతా తౌటమ్ పేర్కొన్నారు. బుధవారం వాట్ ఈజ్ మై గోల్ స్టార్టప్ కంపెనీ ఆధ్వర్యంలో నగరానికి చెందిన 200 మంది విద్యార్థులు అసెంబ్లీని సందర్శించారు. అసెంబ్లీ పరిసరాలు, విధాన సభ పనితీరు, సభా వ్యవహారాలు, కార్యకలాపాలు వంటి విషయాలను తెలుసుకున్నారు. తదనంతరం జరిగిన చర్చాగోష్టిలో విద్యార్థులు భారతీయ రాజకీయాలపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమానికి శాంతా తౌటమ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులతో కాసేపు సరదాగా ముచ్చటించారు. అసెంబ్లీ ఎలా ఉందంటూ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మంత్రి కేటీఆర్ వాట్ ఈజ్ మై గోల్ అనే స్టార్టప్ కంపెనీ ద్వారా నిర్వహించబోతున్న 'యు18'ఎలక్షన్స్ అనే కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రపంగించారు. విద్యార్థులకు వేర్వేరు రంగాల్లో ఉన్న అవకాశాలతో పాటు రాజకీయ ప్రాతినిధ్యంపైన అవగాహన కల్పించడం మంచి విషయమని ప్రశంసించారు. వాట్ ఈజ్‌మై గోల్ నిర్వహిస్తున్న 'యు18'ఎలక్షన్స్‌పై టీ హబ్ సీఈఓ శ్రీనివాసరావు మహంకాళి మాట్లాడుతూ.. మన దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ, ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు, విధివిధానాల గురించి విద్యార్థులు తెలుసుకోవడం ఎంతో ముఖ్యమని చెప్పారు.

సింగరేణి వ్యాప్తంగా యోగా ధ్యాన కేంద్రాలు



సింగరేణి భవన్‌లో జరిగిన యోగా

నాంపల్లి: సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా సింగరేణి సంస్థ కంపెనీ వ్యాప్తంగా యోగా ధ్యాన కేంద్రాలను ఏర్పాటు చేసిందని, జూన్ 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు యోగా సంబంధ కార్యక్రమాలను సింగరేణి వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు జనరల్ మేనేజరు (కో ఆర్డినేషన్) ఎం.సురేష్ పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో శ్రీ రామచంద్ర మిషన్ వారి అనుబంధ సంస్థ అయిన హార్ట్ ఫుల్‌నెస్ ఇనిస్టిట్యూట్ నిర్వాహకులతో మూడు రోజుల పాటు నిర్వహించిన యోగా ధ్యాన శిబిరం ముగింపు సమావేశంలో ఆయన ప్రసంగించారు. మూడు రోజుల పాటు జరిగిన శిబిరంలో విధి నిర్వహణలో కలిగే ఒత్తిడిని తగ్గించుకోవడానికి ప్రాణాయామ, ధ్యాన ఆత్మశుద్ధి తదితర ప్రక్రియలను సులభ పద్ధతిలో నిర్వాహకులు బోధించారు. నేటి ఆధునిక ప్రపంచంలో ఒత్తిడిని జయించాలంటే యోగా ధ్యానం మాత్రమే మంచి సాధనా లని వారు పేర్కొన్నారు. హార్ట్‌ఫుల్ నెస్ ఇనిస్టిట్యూట్ వారు స్వచ్ఛందంగా సింగరేణి భవన్‌లోని ఉద్యోగులు, అధికారులకు యోగా, ధ్యానంపైన అవగాహన కలిగించడంపై కృతజ్ఞతలు తెలియజేస్తూ నిర్వాహకులు శారద, డీఎస్‌వీ.ప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు.

నోరూరించే హై లైన్ హలీం



హలీంను విక్రయిస్తున్న యజమాని సల్మాన్

గన్‌ఫౌండ్రీ: 40 ఏళ్లుగా భోజన ప్రియులకు నోరూరించే రుచికరమైన హలీంను అందిస్తుంది కింగ్‌కోఠి చౌరస్తాలోని హై లైన్ హలీం రెస్టారెంట్ యజమాని సల్మాన్ సేట్ బుధవారం వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన రెస్టారెంట్‌లో వినియోగదారులకు కావాల్సిన రుచికరమైన హలీంతో పాటు పలు రకాల వంటకాలను అందిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా పాయా, జబాన్, నహారి, మటన్, చికెన్, ఫిష్, పన్నీర్, మంది, కుర్బాని స్వీట్‌లను వినియోగదారులకు అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. జొమాటో, స్విగ్గీ వంటి ఆన్‌లైన్ విక్రయాలను కూడా తమ హలీంను రుచిచూడవచ్చని వినియోగదారులకు తెలియజేశారు.

జార్జిరెడ్డికి ఘన నివాళి

గన్‌ఫౌండ్రీ: విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాడిన జార్జిరెడ్డి నుంచి స్ఫూర్తిని పొందాలని పీడీఎస్‌యూ మాజీ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎల్ పద్మ అన్నారు. బుధవారం నిజాం కళాశాలలో పీడీఎస్‌యూ కళాశాల కమిటీ ఆధ్వర్యంలో జార్జిరెడ్డి 51వ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. నేడు నూతన జాతీయ విద్యా విధానం పేరుతో విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు కుట్ర జరుగుతుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా ప్రొఫెసర్ గుమ్మడి అనురాధ, పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి ప్రదీప్, పీడీఎస్‌యూ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు అనిల్, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్, సహాయ కార్యదర్శి రాకేష్ పాల్గొన్నారు.

నిరుద్యోగులకు జీవన భద్రత కల్పించాలి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్ తదితరులు

సుల్తాన్‌బజార్: ఉద్యోగ హక్కు చట్టం చేసి రాజ్యాంగబద్ధం చేయాలని, నిరుద్యోగులకు జీవన భద్రత కల్పించి వారి భవిష్యత్తు కాపాడాలని ఈనెల 25న బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ ప్రొఫెసర్ హరగోపాల్ తెలిపారు. ఈ మేరకు బుధవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉద్యోగాల కల్పన జరగలేదని, నియామకాలు జరగలేదని, లక్షల్లో నిరుద్యోగులు ఉండగా పదుల సంఖ్యలో ప్రకటిస్తున్న పోస్టులకు అర్హత పరీక్షల నిర్వహణలో టీఎస్‌పీఎస్సీ విఫలమైందని ఆయన మండిపడ్డారు. విద్యార్థులకు నైపుణ్యాలను అనుసరించి ప్రభుత్వమే ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యువత నిరుద్యోగులకు బాధ్యత వహిస్తూ ఉద్యోగ హక్కు చట్టం చేసి దానిని రాజ్యాంగబద్ధం కల్పించాలని కోరారు. తమ డిమాండ్లపై అన్ని రాజకీయ పార్టీలు మేధావులతో కలిసి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తునట్లు తెలిపారు. ఈ సమావేశంలో రాఘవచారి, కేపీ.వెంకటేశ్వర్లు, రాజేంద్రబాబు పాల్గొన్నారు.